


టాగోర్ కథలు

తెలుగు సేత: చంద్రలత



అప్సరసతో కాసేపు

రవీంద్రనాథ టాగోర్

పరీర్ పరిచయ్ (బెంగాలీ,1922)



యువరాజు ఇరవయ్యవ పుట్టినరోజు జరిగీ జరగగానే, పెళ్ళిసంబంధాలు వరదలా వచ్చి పడసాగాయి. దగ్గరవి, దూరానివి, ఎక్కడెక్కడి నుంచో.

పెళ్ళిళ్ళ పేరయ్య అన్నాడు.

"బాహ్లీక దేశ యువరాణి ఎంత అందమైనదంటే, ఆమె సౌందర్యం విరిసిన తెల్లగులాబీల వర్షపు జల్లులా ఉంటుంది!"

యువరాజు ముఖాన్ని పక్కకు తిప్పేసుకొన్నాడు.

బదులు పలకలేదు.

ఒక రాయబారి వచ్చి చెప్పాడు.

"గాంధార రాజకుమారి అల్లుకొన్న తీగపై సుతారంగా వేళ్ళాడే ద్రాక్షగుత్తిలా పొందికగా ఉంటుంది. ఆమె సౌందర్యపు వెలుగులు, ఆమె చుట్టూ పరుచుకొని ఉంటాయి."

వేటాడే వంక పెట్టుకొని, యువరాజు అడవికి వెళ్ళిపోయాడు.

మరొక రాయబారి వచ్చాడు. చెప్పాడు.

"నేను ఇప్పుడే కాంబోడియా యువరాణి దర్శనం చేసుకు వస్తున్నాను. ఆమె కళ్ళు భూమి, ఆకాశం కలిసేచోట వంగిన క్షితిజరేఖలా సొగసుగా వంపు తిరిగి ఉంటాయి. ఆ కనులసోయగాలు మంచుబిందువుల చల్లదనం ప్రసరిస్తాయి. వింతైన వెలుగులు చిమ్ముతుంటాయి!"

యువరాజు భర్తృహరి కవిత్వంలో మునిగిపోయాడు. ఒక్కక్షణం కూడా కనురెప్పలెత్తి పైకి చూడలేదు.

మహారాజు అడిగారు.

"అసలు సంగతి ఏమిటి? ప్రధానమంత్రి కుమారుడికి కబురు పెట్టండి."

ప్రధాన మంత్రి కొడుకు వచ్చాడు.

"నువ్వు మా కుమారుడికి వరాన దక్కిన స్నేహితుడివి. నిజం చెప్పు. యువరాజు పెళ్ళి మాట ఎత్తితే ఎందుకు ముఖం తిప్పేసుకొంటున్నాడు?"

ప్రధాన మంత్రి కొడుకు చెప్పాడు.

"మహారాజా, అప్సరసలలోకం, పరీస్థాన్, గురించి విన్నప్పటి నుంచి యువరాజావారికి కలిగిన ఒకే ఒక కోరిక, పెళ్ళంటూ చేసుకొంటే అప్సరస (పరీ) ను చేసుకోవాలని!"

★



మహారాజు తక్షణం ఆజ్ఞలు జారీ చేశాడు. ఆ అప్సరసాలోకం గురించిన అన్ని వివరాలు వెంటనే తెలుసుకోమని.

గొప్ప గొప్ప పండితులందరినీ పిలిపించారు. వాళ్లు మహామహా గ్రంథాలన్నీ అక్షరం అక్షరం వెతికారు. ఆ గొప్ప గొప్ప పండితులందరూ ముక్తకంఠంతో నిట్టూర్చారు. తలలు అడ్డంగా ఆడించారు. పెదవులు విరిచారు.

"ఎక్కడా ఏ గ్రంథాల పుటలలోనూ ఆ అప్సరసాలోకం ఆనవాళ్లు దొరకలేదు."

మహారాజుగారి సభకు వర్తకులను పిలిపించారు.

"మహాసముద్రాలన్నీ దాటుకొని ఎన్నెన్నో ద్వీపాలు మేము తిరిగాం. లవంగలతలకు పుట్టిల్లయిన ఏలా ద్వీపం, మారీచ ద్వీపం వెళ్లాం. గంధపు చెక్కల కోసం మలయద్వీపానికి వెళ్లాం. మంచి కస్తూరి కోసం హిమాలయ సానువుల్లోని దేవదారువనాల్లో గాలించాం. కానీ, ఎక్కడా ఈ అప్సరసాలోకం, పరీస్థాన్, గురించి వినలేదు."

మహారాజు అన్నాడు.

"ప్రధానమంత్రి కుమారుడికి కబురు పెట్టండి!"

ప్రధానమంత్రి కొడుకు వచ్చాడు. మహారాజు అతనిని అడిగాడు.

"యువరాజు ఈ అప్సరసాలోకం గురించి ఎవరి ద్వారా విన్నారు?"

"ఆ వెర్రివెంగళాయి నవీన్ ఉన్నాడే! ఎప్పుడూ చేతిలో వేణువు పట్టుకొని అడవిలో అల్లాయిలొల్లాయిగా తిరుగుతుంటాడు. ఆ నవీన్ ద్వారానే యువరాజువారు ఆ అప్సరసాలోకం గురించి విన్నారు!"

"అలాగా? అయితే, ఆ నవీన్‌కే కబురు పెట్టండి!"

వెర్రివెంగళాయి నవీన్ మహారాజుగారి ముందు ప్రత్యక్షమయ్యాడు. కొన్ని అడవిపూలు మహారాజుగారికి సమర్పించాడు.

మహారాజు నవీన్‌ను అడిగాడు.

"ఆ అప్సరసాలోకం గురించి ఎవరి ద్వారా విన్నావు?"

నవీన్ అన్నాడు.

"అప్సరసాలోకానికి అన్నివేళలా నాకు ప్రవేశం ఉంది!"

మహారాజు నవీన్‌ను అడిగాడు.

"ఆ అప్సరసాలోకం, పరీస్థాన్, అసలు ఎక్కడ ఉంది?"

"మీ రాజ్యం సరిహద్దు అంచుల్లో, చిత్రగిరి పర్వతాల దగ్గర, కామ్యక సరస్సు ఒడ్డున ఉంది."

"అయితే, కనీసం ఒక్కరంటే ఒక్కరైనా ఆ అప్సరసలను కళ్లారా చూడగలరా?" మహారాజు అడిగాడు.

వెర్రివెంగళాయి నవీన్ బదులిచ్చాడు.

"మీరు చూడగలరు. కానీ, మీరు వారి గురించి ఏమీ తెలుసుకోలేరు. అప్సరసలు అదృశ్యరూపాల్లో జీవిస్తుంటారు. ఎప్పుడో ఒకసారి, వాళ్లు అదృశ్యమయ్యే ముందు, ఒక్క కనురెప్పపాటు వాళ్ల నిజరూపాన్ని చూపిస్తారు. వారి ఉనికిని చాటుతారు. మీరు వారిని పట్టుకోలేరు."

మహారాజు అడిగాడు.

"మరి, నీకు వాళ్లు ఎలా తెలుసు?"

వెర్రివెంగళాయి బదులు ఇచ్చాడు.

"కొన్నిసార్లు అటాటున ఒక కూనిరాగం వినబడినప్పుడు, మరికొన్ని సార్లు వారి ఉనికిని చాటే వెలుగు కనబడినప్పుడు."

మహారాజుకి చిరాకేసి అన్నాడు.

"మొదలు పెట్టినప్పటి నుంచి ఇప్పటి దాకా ఇదంతా ఒట్టి పిచ్చితనం. ఈ వెర్రివెంగళాయిని తక్షణం తరిమేయండి!"

•

వెర్రివెంగళాయి మాటలు యువరాజు హృదయంలో ప్రతిధ్వనించాయి.

వసంతకాలం వచ్చింది. కొమ్మకొమ్మకు సాల పుష్పాలు వికసిస్తున్నాయి. అడవంతా శిరీషపుష్పాల పరిమళంతో నిండిపోయింది.

యువరాజు ఒక్కడే చిత్రగిరికి బయలుదేరాడు.

ప్రతి ఒక్కరూ అడిగారు.

"ఎక్కడికి వెళుతున్నావ్?"

యువరాజు జవాబు ఇవ్వలేదు.

ఒక గుహలోనుంచి ఓ జలపాతం ఉరకలు వేస్తూ హోరున కామ్యక సరస్సులోకి దూకుతుంది. పల్లెప్రజలు దానిని "ఉడాష్", ఉరకలెత్తే జలపాతం, అని పిలుస్తారు. ఉడాష్ దగ్గరలో ఒక పాడుబడిన గుడిలో యువరాజు తన నివాసం ఏర్పరచుకొన్నాడు.

ఒక నెల గడిచింది.

ముళ్లకంపల మీద మొలకెత్తిన చిగుళ్లు చిక్కబడసాగాయి. అడవంతా పూలు కుట్టినట్లుగా ఉంది.

ఒక రోజు తెల్లవారుఝామున యువరాజుకు కల వచ్చింది. ఆ కలలో వేణుగానం వినబడింది.

యువరాజు అనుకొన్నాడు.

"ఈ రోజు తప్పక నేను ఓ అప్సరసను కలుస్తాను!"

•

అనుకొన్న వెంటనే యువరాజు తన గుర్రం మీదకు ఎక్కాడు. సెలయేటి వాలున ప్రయాణించాడు. పోగా పోగా కామ్యక సరస్సు ఒడ్డుని చేరుకొన్నాడు.

ఆ తామరసరస్సు ఒడ్డున ఒక గిరిజన యువతి కూర్చుని ఉంది. యువరాజు ఆమెను గమనించాడు.

ఆమె కడవ నీటితో నిండి ఉంది. ఆ చిక్కటి నలుపురంగున్న యువతి తన చిక్కటి నల్లటి కేశాలలో ఒక మెరిసే శిరీషాపుష్పాన్ని చెక్కుకొని ఉంది. అది సంధ్యాసమయంలో మెరిసే తొలినక్షత్రంలా ఉంది. ఆమె ఇంకా సరస్సు ఒడ్డునే కూర్చుని ఉంది.

యువరాజు గుర్రం దిగాడు. ఆమెను అడిగాడు.

"నీ చెవి వెనక ఉన్న పువ్వును నాకు ఇస్తావా?"

ఆమె భయమంటే ఎరుగని జింకపిల్ల లాంటిది. ఆమె తల తిప్పి యువరాజు వంక ఒకమారు చూసింది.

ఒక్క క్షణం ఆమె నల్లటి కళ్లల్లో చీకటి మరింత చిక్కబడింది. నిద్రను తరిమే కలలా, క్షితిజరేఖ మీద సాగే ఆషాఢమాసపు కారుమేఘంలా.

ఆమె తన తలలోని పువ్వును తీసి యువరాజు చేతిలో పెట్టింది. ఎలాంటి జంకూగొంకూ లేకుండా అంది.

"ఇదుగో తీసుకో!"

"నిజం చెప్పు! నువ్వు ఏ దివ్యలోకపు అప్సరసవు?" యువరాజు అడిగాడు.

ఒక్కక్షణం అతనివైపు ఆశ్చర్యంగా చూసింది. ఆ తరువాత శ్రావణమాసంలో విరుచుకుపడి ఎడతెరపి లేకుండా కురిసే కుండపోత వానలాగా నవ్వడం మొదలెట్టింది.

యువరాజు అనుకొన్నాడు.

"నా తెల్లవారుఝాము కల ఫలించింది. ఆమె నవ్వులో ధ్వనించే లయ నా కలలోని వేణుగానంతో శ్రుతితో సరితూగుతుంది!"

యువరాజు గుర్రం మీదకు ఎక్కాడు. తన చేయి చాచి అన్నాడు.

"రా!"

ఆమె అతని చేతిని పట్టుకొని గుర్రం మీదకి ఎక్కింది.

ఆమె నీళ్లకడవ సరస్సు ఒడ్డునే ఉండిపోయింది.

శిరీష వృక్షాల మీది కోయిలలు కూహూ రాగాలు పాడసాగాయి.

యువరాజు ఆమె చెవిలో గుసగుసలాడాడు.

"నీ పేరేమిటి?"

"కజరి," ఆమె బదులిచ్చింది.

గుర్రాన్ని స్వారీ చేస్తూ ఉడాష్ జలపాతం దగ్గరి పాడుబడిన గుడికి చేరుకొన్నారు.

యువరాజు అన్నాడు.

"ఇక, నీ మారురూపాన్ని వదిలేయి!"

ఆమె బదులిచ్చింది.

"నేను అడవిబిడ్డను. నాకు మారువేషాలు తెలియవు!"

యువరాజు అన్నాడు.

"నేను నీ అప్సరసారూపాన్ని చూడాలని అనుకొంటున్నాను."

"అప్సరసారూపమా!"

అలల అలలుగా విరుచుకుపడింది కజరి నవ్వు.

యువరాజు అనుకొన్నాడు.

"ఈ అలలు అలలుగా సాగే నవ్వు, ఎగిరిదూకే జలపాతపు హోరులోని తుళ్లింతల లయల ధ్వనిలా ఉంది. ఈమె జలపాత అప్సరస!"

•

తక్షణం ఈ వార్త చిలువలు పలువలుగా మహారాజు దాకా చేరింది. యువరాజు వివాహం చేసుకొన్నాడని.

రాజమందిరం నుంచి గుర్రాలు, ఏనుగులు, పల్లకీలు వచ్చేశాయి.

కజరి అడిగింది.

"ఇవన్నీ ఎందుకు?"

యువరాజు అన్నాడు.

"నువ్వు రాజమందిరానికి రావాలి!"

కజరి కళ్లు కన్నీళ్లతో నిండి మసకబారాయి. కజరికి ఒక్కొక్కటిగా జ్ఞాపకం వచ్చాయి.

నీళ్లతో నింపిన తన కడవను సరస్సు ఒడ్డున వదిలి వచ్చానని గుర్తుకు వచ్చింది. సేకరించిన గడ్డివత్తనాలను వాకిట్లో ఆరబోసి వచ్చానని గుర్తుకు వచ్చింది. తన నాన్న, అన్న అడవిలో వేటకు వెళ్లారని గుర్తుకు వచ్చింది. వాళ్లు తిరిగి ఇంటికి వచ్చే వేళయ్యిందని గుర్తుకు వచ్చింది.

ఒక చెట్టు కింద కూర్చుని అమ్మ కూనిరాగాలు తీస్తూ తన పెళ్లిచీర నేస్తోందని గుర్తుకు వచ్చింది.

కజరి అంది.

"ఊహు! లేదు. నేను రాను!"

ధంకాలు మోగుతున్నాయి. వేణువులు ఊదుతున్నారు. నగారాలు, భేరీలు ప్రతిధ్వనిస్తున్నాయి.

ఆ రణగొణధ్వనిలో కజరి మాటలు కలిసిపోయాయి.

రాజమందిరం ముందు పల్లకీ దిగుతున్న కజరిని చూసి మహారాణి తలబాదుకొంది.

"ఇదెక్కడి అప్సరస!"

మహారాజు కూతురు అంది.

"ఛీ! ఛీ! ఎంత అగౌరవం!"

యువరాజు అన్నాడు.

"మాటలు జాగ్రత్త! మన ఇంటికి వచ్చింది మారురూపంలో ఉన్న అప్సరస!"

•

రోజులు గడిచిపోతున్నాయి.

నిద్రపట్టని వెన్నెల రాత్రుల వెలుగుల్లో కూడా ఆ జలపాత అప్సరస మారురూపం ఆమె దేహాన్ని అంటిపెట్టుకొని ఉండడం యువరాజు గమనించాడు. కజరి నల్లటి దేహంతో పోటీపడే ఆమె చిక్కని గిరిజాలజుట్టు, ఆమె నల్లని ముఖం చుట్టూ

చిందరవందరగా పరుచుకొని ఉండడం గమనించాడు. నల్లగా నిగనిగలాడే ఆమె దేహం చక్కగా చెక్కిన వంకల్లేని నల్లరాతి శిల్పంలా ఉండడం అతను గమనించాడు.

యువరాజు మౌనంలో మునిగిపోయి ఆలోచించసాగాడు.

"చిక్కటి చీకటిలో దాగిన తొలిపొద్దు వెలుగు లాగా, ఈ చెక్కిన నల్లరాతి శిల్పం వంటి దేహంలో ఆ దివ్య అప్సరస ఎక్కడ దాగి ఉంది?"

తనవారందరి ముందు తాను అవమానానికి గురయ్యినట్లు భావించాడు యువరాజు.

చివరికి ఒక రోజు కొంచెం కోపం కూడా వచ్చింది.

ఒక రోజు పొద్దున్నే కజరి నిద్రలేచి తన పడక మీద నుంచి లేవబోతుంటే, ఆమె చేతిని గట్టిగా బిగించి పట్టుకొన్నాడు.

"ఈ రోజు," యువరాజు అన్నాడు, "నిన్ను ఎటూ కదలనివ్వను. నీ నిజరూపం ఏమిటో నన్ను చూడనివ్వు!"

అతని మాటలకు కజరికి లోగడ అడవిలో వచ్చినంత ఆపుకోలేని నవ్వు రాబోయింది. కానీ, అది ఆమె పెదవుల మీదకు రానైనా రాలేదు.

కజరి కళ్లల్లో నీళ్లు నిండిపోయాయి.

యువరాజు అడిగాడు.

"నువ్వు నన్ను ఎప్పటికీ మోసం చేస్తావా?"

కజరి బదులిచ్చింది.

"లేదు, లేదు. ఇకపై చేయను!"

యువరాజు అన్నాడు.

"అయితే, వచ్చే కార్తీక పౌర్ణమి రోజున అందరినీ నీ నిజరూపాన్ని చూడనివ్వు!"

•

కార్తీక పున్నమి చంద్రుడు రాజమందిరం మీద వెలిగిపోతున్నాడు.

రాజమందిర సంగీత బృంద కచ్చేరి, నహబత్, మంద్రంగా సాగుతోంది. ఆ అందమైన వెన్నెల రాత్రిని మరింత సౌందర్యభరితం చేస్తూ.

పెళ్లికొడుకు అలంకారంలో యువరాజు వరమాలను చేతబట్టుకొని అక్కడికి ప్రవేశించాడు.

ఆ వెన్నెల రాత్రి శుభదృష్టి. పెళ్లికొడుకు, పెళ్లికూతురు చూపులు కలిసే శుభముహూర్త వేళ.

పందిరి మంచం మీద తెల్లటి దుప్పటి పరిచి ఉంది.

దానిమీద తెల్లటి కొండమల్లెలు కుప్పపోసి ఉన్నాయి. వాటిమీద వరదలా వెల్లువెత్తుతున్న వెన్నెల.

మరి, కజరి ఏది?

కజరి ఎక్కడా కనబడడం లేదు.

మూడో ఝామును సూచించే వేణువు ఊదుతున్నారు.

రాజమందిరమంతా రాజబంధువులతో నిండిపోతోంది.

"అప్సరస ఏదీ?" యువరాజు అన్నాడు.

"వీడ్కోలు సమయంలోనే ఆమె నిజరూపాన్ని చూపిస్తుంది. ఆ తరువాత ఆమె అదృశ్యరూపాన్ని ఎవరమూ చూడలేం!"

•

కజరి : నల్లరంగు ధాన్యం. **పరీ** : అప్సరస. **పరీస్థాన్**: అప్సరసాలోకం **శుభదృష్టి** : పెళ్ళి వేడుకలో శుభముహూర్తం **కామ్యక** : కోరిన కోర్కెలు తీర్చే శక్తిగల. **కుందా పుష్పాలు** : కొండమల్లెలు. **శిరీషా పుష్పాలు**: దిరిసెన పూలు.

అనుసృజకుల వ్యాఖ్యానం

"**అప్సరసతో కాసేపు**" కథను మొదట **"పరీర్ పరిచయ్"** (1922) పేరిట బెంగాలీలో రచించారు. ఇది **లిపిక** సంపుటంలో అచ్చయ్యింది.

సాధారణంగా పిల్లల జానపద కథలన్నీ పంచకల్యాణి గుర్రాన్ని స్వారీ చేస్తూ వచ్చే అందమైన కలల రాకుమారుడి చుట్టూ అల్లుకొని ఉంటాయి. అయితే, ఈ కథలో కలలు కనే రాకుమారుడే ప్రధాన పాత్ర.

అలాగే, అప్సరసల అందచందాల గురించి, వారి అపూర్వ శక్తుల గురించి, అదృశ్యరూపాల గురించి జానపదాల్లో ఎంతో ఇష్టంగా కథలు అల్లుకుంటారు.

అలాంటి అప్సరసల చుట్టూ అల్లుకొన్న అభూతకల్పనలన్నిటినీ సున్నితంగా ఆటపట్టిస్తూనే, కల్లాకపటం ఎరుగని అడవిబిడ్డ ఆత్మాభిమానాన్ని, రాకుమారుడి అమాయకత్వాన్ని టాగోర్ హృద్యంగా పరిచయం చేస్తారు.

References :

1. The meeting with the Fairy ,Lipika , Aurobindo Bose,1977,Peterowen Limited,London
2. The Fairies's Identity , Sutapa Chowdary

https://www.parabaas.com/rabindranath/articles/gSutapa_fairy.html

3.The meeting with the fairy ,The Complete Works of Rabindranath Tagore (Illustrated Edition), Lipika ,General press

COMMENTS